

నీటి సంఘం ఎన్నికలు మళ్లీ వాయిదా

పార్వతీపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలు మరోసారి వాయిదాపడ్డాయి. తొలుత ఈ ఎన్నికలు అక్టోబరులో జరగాల్సి ఉంది. అయితే, విజయవాడలో వరదల కారణంగా వాయిదా పడ్డాయి. మళ్లీ, ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదల చేసి, 8న ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఫెంగల్ తుఫాన్ కారణంగా రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తుండడంతో మరోసారి ఈ ఎన్నికలను వాయిదా వేసింది. దీనిపై జిల్లా ఇరిగేషన్ అధికారి అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా.. ఎన్నికలు వాయిదా పడడం వాస్తవమేనని, ఎప్పుడు నిర్వహించేది తేదీ ఖరారు కాలేదని అన్నారు.



ఎన్నాళ్లీ డోలీ మోతలు?

పాచిపెంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదు. మండలంలోని గొట్టూరు పంచాయతీ రిట్లపాడు గ్రామానికి చెందిన కె.ఆదమ్మ అనే మహిళ అనారోగ్యానికి గురైంది. ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో 108 వాహనం వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఆదమ్మను కుటుంబ సభ్యులు మంగళవారం డోలీపై ఆసుపత్రికి తరలించారు. రిట్లపాడు నుంచి ఆలూరు రోడ్డు జంక్షన్ వరకు మూడు కిలో మీటర్లు డోలీపై మోశారు. అక్కడ నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వాహనంపై తరలించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో

మౌలిక సదుపాయాలు కల్పించాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అందంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, పోషణ, నిర్వహణ ప్రగతిపై ఐసీడీఎస్ పీవో, సీడీపీవో, ఎంపీడీవోలతో కలెక్టర్ మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి లోపల, వెలుపల అందమైన రంగులు వేయించాలన్నారు. అందమైన చిత్రాలు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు, వైట్‌బోర్డు, ఆటపరికరాలు, పాఠ్యపుస్తకాలు, కుర్చీలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ పనులను ఎంపీడీవోలు వేగవంతంగా చేయించాలన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, పోషకాలతో కూడిన ఆహారం అందేలా చూడాల్సిన బాధ్యత సీడీపీవోలదే అన్నారు. కేంద్రాల్లో పండించిన ఆకు, కాయగూరలను పిల్లలు తీసుకొనే ఆహారంలో వినియోగించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి ఎం.ఎన్.రాణి, గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఒ.ప్రభాకరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బెల్టు షాపులకు అడ్డుకట్ట పడేదెలా?

- ఈ ఏడాది అక్టోబరు 16 నుంచి నవంబరు 30 వరకు జిల్లాలో 79 బెల్టు దుకాణాలపై ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు చేశారు. 79మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. మరో 54 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. 222.57 లీటర్ల మద్యం, 4.55 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నారు. 45 రోజుల్లోనే 79 కేసులు నమోదు చేశారంటే జిల్లాలో ఏ విధంగా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారో అర్థమవుతుంది.

- గ్రామాల్లో ఇష్టారాజ్యంగా ఏర్పాటు
- దాడులు చేయకుండా అధికారులపై ఒత్తిడి
- తెర వెనుక రాజకీయ పార్టీల నేతలు
- అడకత్తెరలో ఎక్సైజ్‌శాఖ





పార్వతీపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాల యజమానుల్లో చాలామంది ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తే మొదటిసారి రూ.5 లక్షల జరిమానా విధిస్తామని, రిపీట్ అయితే లైసెన్స్ రద్దు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా పట్టించుకోవవడం లేదు. తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు గ్రామాల్లో బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. కొత్త మద్యం పాలసీ నేపథ్యంలో జిల్లాలో 52 ప్రైవేటు వైన్ షాపులు ఏర్పాటయ్యాయి. మండలం యూనిట్‌గా దుకాణాల కేటాయింపు జరిగింది. దీంతో షాపులు దక్కించుకున్న వారు, వ్యాపారానికి అనుకూలమైన ఏరియాలను గుర్తించి ఆయాచోట్ల షాపులు ప్రారంభించారు. అధికార పార్టీ, విపక్షాల నాయకుల కనుసన్నల్లోనే మద్యం వ్యాపారం జరుగుతుందనే విమర్శలు ఉన్నాయి. కొంతమంది వ్యాపారులు అధిక సంపాదనకు ఆశపడి గ్రామాల్లో బెల్టు దుకాణాలను పెట్టిస్తున్నారు. లైసెన్స్ మద్యం దుకాణాల ద్వారానే వీటికి సరుకు సరఫరా అవుతుంది. ఏ గ్రామంలో చూసినా కనీసం రెండు నుంచి మూడు బెల్టు దుకాణాలు ఉన్నాయి. బెల్టు నిర్వాహకుల్లో కొందరు కొన్ని రాజకీయ పార్టీల మద్దతుదారులుగా ఉన్నారు. మరికొంతమందికి పరోక్షంగా రాజకీయ నేతలతో సంబంధాలు ఉన్నాయి. దీంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించిన వెంటనే వారిపై రాజకీయ ఒత్తిడి ప్రారంభమవుతుంది. ఆ వెంటనే పట్టుకున్న కేసులో గ్రావిటీ తగ్గిపోతుంది. తమ మాట వినని ఎక్సైజ్ అధికారులు, సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. ఎవరు కాదన్నా, అవునన్నా ఇది నూటికి నూరు శాతం నిజం. గత 45 రోజుల్లో పార్వతీపురం సర్కిల్‌లో 9, సాలూరు 12, కురుపాం ఐదు, సీతానగరం 28, పాలకొండ సర్కిల్‌లో 25 కేసులు నమోదయ్యాయి. కాగా, కొన్ని సర్కిల్ ప్రాంతాల్లో అధికారులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు ఎక్కువగా ఉన్నాయి. గంజాయి విక్రయించే వారి ఆస్తులను జప్తు చేస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. అదే విధంగా గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలు నిర్వహించే వారిపై కఠినంగా వ్యవహరించాలనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. బెల్టు నిర్వాహకుల సంక్షేమ పథకాలు, ఎన్టీఆర్ వైద్య సేవలు రద్దు చేస్తే అక్రమ మద్యం వ్యాపారం కట్టడి జరిగే అవకాశం ఉంది.

దాడులు నిర్వహిస్తున్నాం

మద్యం బెల్టు దుకాణాలు, సారా నివారణ కోసం మూడు బృందాలు దాడులు నిర్వహిస్తున్నాయి. బెల్ట్ నిర్వాహకులపై కేసుల నమోదుకు సంబంధించి ఎక్సైజ్ అధికారులపై ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు. బెల్ట్ దుకాణాలు నిర్వహించినా, సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు కఠినంగా ఉంటాయి.

-జీవనకిషోర్, ఏఈఎస్, పార్వతీపురం మన్యం జిల్లా

హమ్మయ్యా..!

- తుఫాన్ వదిలింది
- వాతావరణం తెరిపిచ్చింది
- వ్యవసాయ పనుల్లో రైతాంగం

గరుగుబిల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):జిల్లాను ఫెంగల్ తుఫాన్ వదిలింది. తుఫాన్ ప్రభావంతో గత ఐదు రోజులుగా జిల్లాలో మబ్బులు కమ్ముకుని చిరుజల్లులు కురిశాయి. దీంతో పొలాల్లో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడ్డారు. పొలాల్లోనే వరి కుప్పలు పెట్టి వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పారు. కళ్లాలకు చేర్చిన వరిచేను కుప్పలపై, నూర్చిన ధాన్యంపై, నూర్పు మధ్యలో ఉన్న వరిపై పరదాలు వేశారు. మరో మూడు రోజులు ఇదే పరిస్థితి ఉంటే ధాన్యం మొలకెత్తే అవకాశం ఉందని ఆందోళన చెందారు. అయితే, మంగళవారం వాతావరణం తెరిపివ్వడంతో హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణం అనుకూలించడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఆరబెట్టిన ధాన్యం నిల్వలను తరలించే చర్యలు చేపట్టారు. యంత్రంతో నూర్పు చేసిన ధాన్యంపై టార్పాలిన్లు వేసి ఉంచడంతో కొంతమేర అవి తడిసిపోయాయి. ఇవి ఆరేందుకు మరికొద్ది రోజుల సమయం పట్టనుంది. రైతుసేవా కేంద్రాల్లో తేమ శాతంతో పాటు పలు నిబంధనలు ఉండటంతో అధికంగా రైతులు తడి ధాన్యాన్ని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం సాధారణ రకం 100 కిలోలకు రూ. 2,300, 75 కిలోలకు రూ.1,725, గ్రేడ్-ఏ రకం వంద కిలోలు రూ. 2,320, 75 కిలోలకు రూ. 1,740 ధర నిర్ణయించింది. ప్రస్తుతం ధాన్యం కొంతమేర తడిసిపోవడంతో 84 కిలోల బస్తాను రూ.1500 విక్రయిస్తున్నారు.


గొట్టివలసలో ధాన్యం తూకం వేసి లారీకి లోడింగ్ చేస్తున్న దృశ్యం


ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ శోభిక

రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగరాదు

- జాయింట్ కలెక్టర్ శోభిక

కొమరాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, కనీస మద్దతు ధరకు తక్కువ కాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక ఆదేశించారు. మంగళవారం గుణానుపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో తేమ శాతం, ఎఫ్‌టీవో జనరేషన్ చేసే విధానాన్ని పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఒక్కో కేంద్రానికి ముగ్గురు చొప్పున తాత్కాలిక సిబ్బందిని నియమించామని వివరించారు. కంప్యూటరీకరణ, ట్రక్ షీట్లు, మిల్లులకు ధాన్యం తరలింపు, తేమ శాతం తెలుసుకోవడంపై సిబ్బందికి అవగాహన కల్పిస్తూ శిక్షణ కూడా ఇచ్చినట్లు చెప్పారు. రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురికారాదనే ప్రభుత్వం ఇన్ని ఏర్పాట్లు చేసిందని, అందుకు తగిన విధంగా సిబ్బంది నడుచుకోవాలని తెలిపారు.


వినూత్న నిరసన తెలుపుతున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

కళ్లకు గంతలు కట్టుకుని.. మోకాళ్లపై నిల్చొని..

- అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల వినూత్న నిరసన

బెలగాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల విద్యాలయాల్లో ఎన్నో ఏళ్లుగా బోధిస్తున్న తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు ఇవ్వాలని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయం వద్ద మంగళవారం కళ్లకు గంతలు కట్టుకుని, మోకాళ్లపై నిల్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులకు 24 గంటలూ బోధన అందిస్తున్నామన్నారు. చాలీ చాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ విద్యావ్యవస్థలో లేని అవుట్ సోర్సింగ్ విధానం గిరిజన గురుకులాల్లో ప్రవేశ పెట్టి రెగ్యులర్ ఉపాధ్యాయుల కంటే తమతో ఎక్కువ పని చేయించుకుంటున్నారని వాపోయారు. 15 ఏళ్లుగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నామని, ఇప్పుడు ఈ పోస్టుల భర్తీకోసం డీఎస్సీలో నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమన్నారు. తమ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. తమను సీఆర్టీలుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజనఅవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సంగీతం మన సంపదని..!



- భావితరాలకు అందించేందుకు కృషి
- ఎంతోమందికి శిక్షణ
- ఇదీ సంగీత గురువు భీష్మారావు ప్రయత్నం

6లో

విదర్భ విజయం

- 16 పరుగుల తేడాతో ఛత్తీస్‌గఢ్ జట్టుపై గెలుపు
- త్రుటిలో తివారీ చేజారిన సెంచరీ



6లో

వైద్య సేవలపై నిర్లక్ష్యం వద్దు

- సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గరుగుబిల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సేవలపై నిర్లక్ష్యం వహించరాదని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. మంగళవారం గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రులకు వచ్చే రోగులను సాదారంగా ఆహ్వానించి మెరుగైన సేవలందించి గుర్తింపు పొందాలని వైద్యులకు సూచించారు. సచివాలయాల పరిధిలోని వైద్య సిబ్బంది గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. వీటితో పాటు గ్రామాల్లోని గర్భిణుల ఆరోగ్యంపై అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు ప్రత్యేక పర్యవేణ చేయాలన్నారు. రక్తహీనతతో బాధపడే వారికి అవసరమైన అవగాహన కల్పించాలన్నారు. బాలికలకు సంబంధించి ఏఎన్‌సీ, పీఎన్‌సీ సేవలను మెరుగుపర్చాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీలు, ఆశావర్కర్ల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముక్త భారత్ కార్యక్రమానికి సంబంధించి రికార్డులు, పరీక్షల నిర్వహణ కేంద్రాన్ని నిశితంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమం మేనేజరు డాక్టర్ తెర్లి జగన్మోహన్ రావు, వైద్యాధికారులు కేకే సాగర్‌వర్మ, సంతోష్‌కుమార్, ఎంపీడీవో జి.పైడితల్లి, సిబ్బంది డి.మృత్యుంజయరావు, పి.శ్రీనివాసరావు, ఉదయకుమారి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

చిన్నబోయిన వైకల్యం!

- ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు

6లో

సంగీతం మన సంపదని..!


చిన్నారులకు సంగీత పాఠాలు చెబుతున్న భీష్మారావు

- భావితరాలకు అందించేందుకు కృషి
- ఎంతోమందికి శిక్షణ
- ఇదీ సంగీత గురువు భీష్మారావు ప్రయత్నం

విజయనగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి)

కళల కాణాచిగా పేరొందిన విజయనగరం గడ్డపై ఊపిరి పోసుకున్న ఎంతోమంది సంగీతం, సాహిత్యం, నృత్యం, గాత్రంలో తమ ప్రతిభ చూపిస్తున్నారు. ఇదే జిల్లాకు చెందిన ఘంటసాల, సాలూరు రాజేశ్వరావు, ఆర్.పి. పట్నాయక్ వంటి వారు తెలుగు సినిమా సంగీత ప్రపంచంలో తమదైన ముద్ర వేశారు. ఇలాంటి నేలపై సంగీతం కనుమరుగు కాకూడదని.. మరికొందరు ప్రతిభా వంతులను తయారు చేయాలని విజయనగరానికి చెందిన ఎం.భీష్మారావు అనే సంగీత గురువు తపిస్తున్నారు. సంగీత కళాకారుడిగా రాణిస్తున్న ఆయన సొంత ఖర్చులతో కీ బోర్డు, వయోలిన్, తబల, వీణ, గిటార్, హార్మోనియం వంటి సంగీత వాయిద్యాలను సమకూర్చుకున్నారు. గత 38 ఏళ్లుగా వయసుతో సంబంధం లేకుండా చిన్నారులు, గృహిణులు అందరికీ సంగీతం నేర్పిస్తున్నారు. అప్పటి కలెక్టర్ హరిజవహర్‌లాల్‌తో ఓ పాటను రికార్డు చేయించడం విశేషం. ప్రస్తుతం 50 మందికి పైగా ఆయన వద్ద సంగీతంలో శిక్షణ పొందుతున్నారు.

ఘంటసాల కళాపీఠంతో...

మద్దుగారు భీష్మారావుకు ఘంటసాల అంటే ఎంతో అభిమానం. దీంతో 1997లో అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పేరిట 'ఘంటసాల స్మారక కళాపీఠం' అనే సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఏటా డిసెంబరు 4న మధుర గాయకుడు ఘంటసాల జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయన ఆలపించిన పాటలతో సంగీత విభావరి ఏర్పాటు చేస్తుంటారు. సుమారు 27 ఏళ్లుగా ఘంటసాలకు 'స్వర నీరాజనం' అందిస్తున్నారు. దీంతో పాటు కోరుకొండ సైనిక్ స్కూల్‌లో విద్యార్థులకు కూడా సంగీతం నేర్పుతున్నారు. 'శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ' ద్వారా అన్నమయ్య కీర్తనలు, తదితర సంగీత పరమైన కార్యక్రమాలు చేపడుతున్నారు. భీష్మారావు కుమారులు సాయి, పవన్ సినీ సంగీత దర్శకుల వద్ద సహాయకులుగా ఉన్నారు.


మద్దుగారు భీష్మారావు

భావితరాలకు అందించాలని..

అమర గాయకుడు ఘంటసాల ఓ ధ్రువతారగా శ్రోతల మదిలో నిలిచిపోయారు. అందుకే ఆయన పేరుతో 'ఘంటసాల స్మారక కళాపీఠం' స్థాపించి.. ఏటా వివిధ కార్యక్రమాలు చేస్తున్నాం. భావితరాలకు సంగీత వారసత్వాన్ని అందించాలన్నదే నా ఆకాంక్ష. అందుకే 40 ఏళ్లుగా సంగీత సేవ చేస్తున్నాను. సంగీతం, సాహిత్యం, నాట్యం నేరుకోవడం వల్ల ఒత్తిడికి దూరమవుతారు. ఎప్పుడూ సెల్‌ఫోన్‌లో గడిపే యువత సంగీతం, కళలను నేర్చుకోవాలని కోరుతున్నాను. విద్యార్థులు కూడా సంగీత సాధనతో ఒత్తిడికి దూరంగా ఉండొచ్చు.

-ఎం.భీష్మారావు, సంగీతం గురువు

సంగీతంపై మక్కువ..

సంగీతం అంటే మాకు చాలా ఇష్టం. మేం నేర్చుకోలేకపోయామని కొంత బాధ ఉండేది. ఇప్పుడు మా పిల్లలకు సంగీతం నేర్పించాలనే ఆలోచనతో భీష్మారావు వద్ద చేర్పించాం. ఆయన ఉచితంగా సంగీతం నేర్పడమే కాదు... మా చిన్నారులతో కచేరీలు నిర్వహించడం ఆనందంగా ఉంది.

-డి.స్వాతి, విద్యార్థిని తల్లి

నేడు ఘంటసాల స్వరాభిషేకం

విజయనగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలపించిన సినిమాల్లోని పాటలతో 12 గంటల నిర్విరామ ఘంటసాల స్వరాభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. కళాపీఠం వ్యవస్థాపకులు, సంగీత గురువు మద్దుగారు భీష్మారావు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఏటా డిసెంబరు 4న అమర గాయకుడు ఘంటసాల జయంతి సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సంగీత కళాశాల ప్రాంగణంలోని ఘంటసాల విగ్రహానికి కళాపీఠం ప్రతినిధులు నరసింహరాజు (బుచ్చిబాబు), ధవళ సర్వేశ్వరావు, మేకా కాశీ విశ్వేశ్వరుడు, గ్రంధి విష్ణుమూర్తి, వైవీవీ సత్యనారాయణ నివాళులు అర్పించనున్నారని.. అక్కడి నుంచి ఆనంద గజపతి ఆడిటోరియానికి ర్యాలీగా వెళ్లనున్నట్లు తెలిపారు. అక్కడ ఘంటసాల స్వరాభిషేకం నిర్వహిస్తున్నట్లు భీష్మారావు చెప్పారు.


సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిన్నబోయిన వైకల్యం!

- ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు

విజయనగరం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో మంగళవారం జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వారి ఉత్సాహం ముందు వైకల్యం చిన్నబోయింది. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 300 మంది విభిన్న ప్రతిభావంతులు హాజరయ్యారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు, పరికరాలు అందజేశారు క్రీడాకారులకు, వారి తల్లిదండ్రులకు గోవింద జ్యూయలరీ సంస్థ భోజన ఏర్పాట్లు చేసింది. విజయనగరం నగర పాలక సంస్థ తాగునీరు అందించింది. వివిధ క్రీడాంశాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి నెల 6న బహుమతులు అందించనున్నట్లు డీఎస్‌డీవో ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.


దివ్యాంగ బాలుడి లాంగ్ జంప్


పోటీలకు హాజరైన దివ్యాంగులు


ఇదీ నా సత్తా...


కంచరాం నుంచి కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి

రహదారేనా?

కంచరాం సమీపంలోని జగనన్న కాలనీకి వెళ్లే దారిది. కాలనీ నిర్మాణం చేపట్టి సుమారు మూడేళ్లు. నేటికీ పక్కా రహదారి లేదు. వర్షం వస్తే అవస్థే. మధ్యలో వాహనం దిగబడిపోయి నరకయాతన అనుభవించిన వారెందరో. కంచరాం గ్రామం నుంచి కాలనీకి వెళ్లడానికి 40 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.40 లక్షల వరకు నిధులు కేటాయించారు. పనులు చేపట్టి సుమారు ఏడాది కావస్తున్నా ఇంతవరకు కాంట్రాక్టర్‌కు ఒక బిల్లు కూడా చెల్లించలేదని సమాచారం. పూర్తిస్థాయిలో నిధులు ఇస్తేనే రోడ్డు వేస్తానని చెబుతున్నట్లు తెలుస్తోంది.

-రాజాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి)


అడుగు పెట్టలేని స్థితిలో..

విదర్భ విజయం

- 16 పరుగుల తేడాతో ఛత్తీస్‌ఘడ్‌పై గెలుపు
- త్రుటిలో తివారీ చేజారిన సెంచరీ



విజయనగరం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ ఆధ్వర్యంలో డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు స్పోర్ట్స్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న సయ్యద్ ముస్తక్ అలీ టీ-20 టోర్నీలో విదర్భ జట్టు, ఛత్తీస్‌ఘడ్‌పై 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇరు జట్ల మధ్య మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌ఘడ్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 206 పరుగుల భారీ స్కోర్ సాధించింది.. ఆ జట్టు ఓపెనింగ్ బ్యాటర్, టీమిండియా మాజీ ఆటగాడు కరుణ్ నాయర్ (4) స్వల్ప స్కోర్‌కే అవుటైనా, మిగతా బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో విదర్భ జట్టు భారీ స్కోర్ సాధించింది. జట్టు మరో ఓపెనింగ్ బ్యాటర్ అథర్వ తైదే (34 పరుగులు), పీఆర్ రేఖదే (19), మందర్ మహలే (39), ఎస్‌బి దూబే అజేయ అర్ధసెంచరీ (52 పరుగులు), కెప్టెన్ జేఎం శర్మ (14 బంతుల్లో 38 పరుగులు), ఏవీ వాంఖేడే 4 బంతుల్లో 14 పరుగులు ధాటిగా ఆడటంతో భారీ స్కోర్ సాధ్యమైంది. అనంతరం 207 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఛత్తీస్‌ఘడ్ జట్టు 19.4 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. జట్టు ఓపెనింగ్ బ్యాటర్ ఏజీ తివారీ తృటిలో సెంచరీ (59 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సులతో 98 పరుగులు) చేజార్చుకున్నాడు. మిగతా బ్యాటర్లు రాణించకపోవడంతో ఓటమి పాలైంది. విదర్భ జట్టు బౌలర్లు సమష్టిగా రాణించడంతో జట్టు విజయం సునాయాసమైంది. ఈ విజయంతో విదర్భ జట్టు ఖాతాలో 4 పాయింట్లు చేరాయి.


ఛత్తీస్‌ఘడ్ బ్యాటింగ్

ఒక ఊరు.. రెండు మండలాలు!

కొత్తవలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆ ఊరు పేరు చెప్పగానే ముందుగా ఎవరైనా ఏ మండలం అని అడుగుతారు. ఎందుకంటే ఆ గ్రామం రెండు మండలాల్లో ఉంది మరి. అదే కోనమశివానిపాలెం. ఆ గ్రామంలో సగభాగం కొత్తవలస మండలంలో.. మరికొంత భాగం లక్కవరపుకోట మండలంలో ఉంది. కొత్తవలస మండలంలోని కోనమశివానిపాలెం దేవాడ పంచాయతీలో ఉండగా... లక్కవరపుకోట మండలంలోని కోనమశివానిపాలెం ప్రత్యేక పంచాయతీగా ఉంది. మొత్తం గ్రామమంతా కలిసే ఉంటుంది. రెండు గ్రామాలకు మధ్య చిన్న సరిహద్దు ఉంది. ఆ సరిహద్దును బట్టి తమ గ్రామాలు ఏ మండలంలో ఉన్నాయో తెలుస్తుందని స్థానికులు అంటున్నారు. ఆ గ్రామాన్ని ఏదో ఒక మండలంలో పూర్తిగా విలీనం చేయాలని స్థానికులు పోరాటాలు చేసి అలసిపోయారు. కొత్తవలస మండలంలో విలీనం చేస్తే తమకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. లక్కవరపుకోట మండల కేంద్రానికి పనిమీద వెళ్లాలంటే కొత్తవలస వచ్చి వెళ్లాలి. లేదా తామరాపల్లి, శ్రీరాంపురం, జమ్మాదేవిపేట గ్రామాల మీదుగా వెళ్లాల్సి వస్తుందని అంటున్నారు.

ఎన్నో వినతిపత్రాలు ఇచ్చాం..

మా గ్రామాన్ని పూర్తిగా ఏదో మండలంలో విలీనం చేయాలంటూ ఎన్నోసార్లు జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను ఇచ్చాం. అయినా ఫలితం లేకపోవడంతో పోరాటాన్ని విరమించుకున్నాం. మొత్తం కోనమశివాలెం గ్రామాన్ని కొత్తవలస మండలంలో విలీనం చేయాలని కోరుతున్నాం. ఇప్పటికైనా మా గ్రామ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

-దూది సత్యనారాయణ, మాజీ సర్పంచ్, కోనమశివానిపాలెం, లక్కవరపుకోట మండలం

వాహనంలో హరిదాసు

రామయ్య చిత్రపటం, అక్షయ పాత్ర, సౌండ్ సిస్టమ్‌తో ఆకట్టుకుంటున్న జగన్నాథరావు


రామయ్య రథంతో విజయనగరం వీధుల్లో హరిదాసు జగన్నాథరావు

విజయనగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆయన పేరు జగన్నాథరావు. హరిదాసు వేషధారణలో పల్లె, పట్టణాలను సందర్శించడం అలవాటు. తాజాగా వీధి వీధికి వెళ్తూ విజయనగరంలోని తోటపాలెంలో 'ఆంధ్రజ్యోతి' కంట పడ్డారు. ఈ ఏడాది కాస్త వినూత్నంగా ఓ బండిలో భక్తుల వద్దకు వెళ్తున్నారు. ఇదేంటిలా అని ప్రశ్నించగా వయసు మీద పడడంతో నడవలేక బండిపై వెళ్తున్నానని చెప్పారు. ఎస్.కోట మండలం వెంకట రమణపేట (మల్లిపూడి)కు చెందిన ఈయనకు ఓ భక్తుడు చిన్నపాటి మోపెడ్‌ను రథంలా తయారు చేసి ఇచ్చాడు. దానినే పర్యటనకు వాడుకుంటున్నారు. వాహనంలో వివిధ రకాల పుష్పాలు, ఫలాలతో పూజలు చేస్తున్న సీతారామ లక్షణ సమేత ఆంజనేయస్వామి చిత్రపటం ఏర్పాటు చేసుకున్నారు. అక్షయ పాత్రను కూడా అమర్చారు. హరినామ కీర్తనలు వీధిలో భక్తులందరికీ వినపడేటట్లు సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు. ఏడాదిలో చైత్రం, కార్తీకం, శ్రావణమాసం, ధనుర్మాసాల్లో హరినామ కీర్తనలు చేస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక భావన, చింతన కలిగేటట్లు చేయటమే తన విధి అని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 150 మంది వరకు హరిదాసులు ఉన్నట్లు వెల్లడించారు.

- హరిదాసు అంటే సంప్రదాయ దుస్తుల్లో చెప్పులు లేకుండా, తలపై అక్షయ పాత్ర, తంబురు చేతపట్టి హరినామ కీర్తనలు స్మరిస్తూ వీధుల్లో సంచరించడమే అందరికీ తెలుసు. భక్తులు ఇచ్చిన బియ్యం, ఫలాలు తీసుకుని పాత్ర నిండిన వెంటనే ఆ వీధిలో ఓ ఇంట్లో వాటిని భద్ర పర్చి వెళ్తారు. జగన్నాథరావు సంప్రదా యాలన్నీ పాటిస్తూ కేవలం నడవలేక వాహనం ఏర్పాటు చేసుకున్నారు.


రథం లోపలి భాగంలో సీతారాముల చిత్రపటం, అక్షయ పాత్ర

నేడు ఘంటసాల జయంతి

శృంగవరపుకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట జూనియర్ కళాశాలలో బుధవారం పద్మశ్రీ ఘంటశాల వెంకటేశ్వరరావు జయంతి పురస్కరించుకుని స్వర సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఘంటసాల స్వరాలయ అధ్యక్షుడు ధవళసర్వేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొననున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి,ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరుకానున్నారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

విజయనగరం, కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల ఆరు నుంచి వచ్చే నెల ఎనిమిదోతేదీ వరకూ గ్రామరెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఈ మేరకు సంబందించి భూపరిపాలన విభాగ కమిషనర్ ఆర్పీ సిసోడియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్ల ఆధ్వర్యంలో గ్రామసభల షెడ్యూల్ తయారు చేయనున్నారు.పెద్దగ్రామాల్లో రోజంతా, చిన్న గ్రామాల్లో ఆపూడే సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుల్లో తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టరు, మండల సర్వేయర్‌తోపాటు దేవదాయ, వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు పాల్గొంటారు. సదస్సులు నిర్వహించే సమయంలో గ్రామపటంతోపాటు ప్రభుత్వ భూములు వివరాలు డిస్‌ప్లేచేస్తారు. వినతులపై రసీదులు కూడా ఇవ్వాలి. సదస్సులను పర్యవేక్షణ బాధ్యత డిప్యూటీ కలెక్టర్లకు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పొందుపరిచారు. సదస్సుల నిర్వహణకు జిల్లాకు రూ.10 లక్షలు చొప్పున బడ్జెట్ కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

10న చలో విజయవాడ

రాజాం/రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలని ఈనెల పదో తేదీన విజయవాడలోనిర్వహించనున్న సీపీఎస్ ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు మొయ్యి శ్రీరాములు, చంద్రినాయుడు, డోలవాసు డిమాండ్ చేశారు. మంగళవారం పలు పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో చలో విజయవాడ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు వేర్వేరుగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో విధులు నిర్వహిసున్న సీపీఎస్ ఉద్యోగులంతా విజయవాడ తరలిరావాలని కోరారు.

లేఅవుట్ల పరిశీలన

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు3: మండలంలోని బొడ్డవర తదితర జగనన్న కాలనీల లేఅవుట్లను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి కామేశ్వరరావు, మండల గృహనిర్మాణ శాఖ ఏఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు.కార్యక్రమంలో గృహనిర్మాణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

రాజాం/రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలివలస ప్రాథమిక పాఠశాలలో 33 మంది విద్యార్థులకు గ్రామానికిచెందిన ఎల్ల సూర్యనారాయణ, లెంక గణనాథ, శాసపు వెంకటరమణ ఆబోతుల హరి, అవురు గణనాథ,శాసపు రమణమూర్తి రూ.20 వేల విలువచేసే దుస్తులను సమకూర్చారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి సమక్షంలో వీటిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీరాములు, స్కూల్ చైర్మన్ రమణమ్మ, రమేష్, దుర్గారావు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలు..

కొత్తవలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గురుదేవ చారిటబుల్‌ట్రస్టుతో కలిసి సేవాకార్యక్రమాల్లో పాల్గొనడం తమకు ఎంతో ఆనందంగా ఉందని యూఎస్‌ఏకు చెందిన చేతన ఫౌండేషన్ ఇండియా ప్రతినిధి కిషోర్ తెలిపారు. మంగళవారం మంగళపాలెంలో శ్రీకాకుళంలోని దివ్యాంగుల కోసం చేతన ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ట్రస్టు ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవాకార్యక్రమాలను అందించడానికి ప్రణాళికలను సిద్ధంచేస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్‌చైర్మన్ ఫణీంద్ర గురుదేవ ఆసుపత్రి వైద్య బృందం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

డెంకాడ,డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినతాడివాడలో మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు రైతు సేవ కేంద్రం పరిధిలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు, తరలింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభూషణరావు, ఏవో పూడి నిర్మల పాల్గొన్నారు.

ఓడీఎఫ్ ర్యాంకు సాధనకు సహకరించాలి

నెల్లిమర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీని బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత (ఓడీఎఫ్)గా తీర్చిదిద్దేందుగా ప్రతిఒక్కరూ సహకరించాలని కమిషనర్ కె.అప్పలరాజు కోరారు. మంగళవారం నెల్లిమర్లలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు, వార్డు సభ్యులతో బహిరంగ మలమూత్రవిసర్జన రహిత నగరపంచాయతీగా ధ్రువీకరించి తీర్మానించినట్లు తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేస్తే రూ.500 జరిమానాతోపాటు పదిరోజుల జైలు శిక్ష ఉంటుందని పేర్కొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

శృంగవరపుకోట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) ఎస్.కోటలోని పుణ్యగిరి ఉమాకోటిలింగేశ్వరస్వామి, శ్రీదారగంగమ్మతల్లి హుండీ ఆదాయం రూ.5,56,739 లభించింది. మంగళవారం దేవదాయశాఖఅధికారులు హుండీ లెక్కించారు. ఈ మేరకు ఉమాకోటి లింగేశ్వరస్వామి హుండి నుంచి రూ. 4,12,432, శ్రీదారగంగమ్మ తల్లి ఆదాయం రూ. 1,39,317 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



పురిటిపెంట జగనన్న కాలనీలో బురదమయమైన రోడ్డు

రోడ్లు లేక.. ఇళ్లకు వెళ్లలేక

● చినుకుపడితే బురదమయమవుతున్న వైనం

● ఇదీ పురిటిపెంట జగనన్న కాలనీలో పరిస్థితి

గజపతినగరం, డిసెంబరు 3: (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురిటిపెంట పంచాయతీ పరిధిలో గల జగనన్న కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడకు చేరుకోవడానికి రోడ్లు సైతంలేవు. గతంలో ఏర్పాటుచేసిన మట్టిరోడ్లు చినుకుపడితే బురదమయమవుతున్నాయని పలువురు వాపోతున్నారు. దీంతో కాలనీలో నిర్మించిన ఇళ్లకు వెళ్లలేకపోతున్నామని లబ్ధిదారులు చెబుతున్నారు. ఈ కాలనీలో 350 మందికి స్థలాలు కేటాయించగా 250 నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇందులో 150 ఇళ్లలో 450 మంది వరకు నివసిస్తున్నారు. కిలోమీటరు దూరంలో ఉండడంతో ప్రతి పనికిగజపతినగరానికి వెళ్లాల్సివస్తోంది. అక్కడకు అధ్వానం మార్గంలోనే చేరుకుంటున్నామని పలువురు వాపోతున్నారు. కాలనీలో అంతర్గతరోడ్లు అధ్వానంగా ఉండడంతో ఇక్కడ నివసిస్తున్న వారంతా ఇబ్బందిపడుతున్నారు. ఈవిషయాన్ని ఐదునెలల కిందట కాలనీలో పర్యటించిన కేంద్ర బృందం దృష్టికి స్థానికులు తీసుకు వెళ్లిన విషయం విదితమే. ఇటీవల మండలపరిషత్ కార్యాలయంలో కాలనీలో రోడ్లపై మంత్రి శ్రీనివాస్ కూడా అధికారులతోచర్చించారు. ప్రస్తుతం రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదమయంకా వడంతో కాలనీ వాసులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్లు, విద్యుత్ సదుపాయం కల్పిస్తామన్న గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.కాలనీలో మౌలికసదుపాయాలతోపాటు రోడ్లు నిర్మించాలని పలుసార్లు అధికారులు చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండాపోయిందని వాపోయారు. దీనికితోడు లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని, పూర్తిస్థాయిలో తాగునీటి సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

డబ్బులు వసూలు చేసి.. బోగస్ పట్టాలిచ్చారు

● మెంటాడకు చెందిన 34 కుటుంబాలు నిరసన



కలెక్టర్ ఎదుట నిరసన తెలుపుతున్న మెంటాడ రైతులు

మెంటాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): డబ్బులు వసూలు చేసి డమ్మీ పుస్తకాలు, బోగస్ పట్టాలు ఇచ్చి మోసగించారని మెంటాడ గ్రామానికి చెందిన 34 దళిత కుటుంబాలు వాపోయాయి. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగాయి. అనంతరం డీఆర్వోకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ జీవనాధారంలేని తామంతా గ్రామంలో ఖాళీగాఉన్న ప్రభుత్వ భూమిని సాగుచేసుకోగా, వాటికి పట్టాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు.2020లో అప్పటి తహసీల్దార్ త్వరగా 1బిలు, పట్టాలు, పాసు పుస్తకాలు మంజూరయ్యేలా చూస్తానని హామీఇచ్చారని చెప్పారు. కొన్నాళ్ల తర్వాత తాము సాగుచేసుకుంటున్న భూవిస్తీర్ణం బట్టి తలా రూ. 5 నుంచి 10 వేలుఇస్తే పట్టాలు మంజూరయ్యేలా చూస్తామని కొందరు చెప్పడంతో అప్పులు చేసి ఇచ్చామని డీఆర్వో శ్రీనివాసుమూర్తికి వివరించారు. ఈక్రమంలో సదరు వ్యక్తులు కొన్నాళ్లకు మాకు పట్టాలు, పాసు పుస్తకాలు మంజూరయ్యాయని చెప్పి 34 మందికి తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారని, వాటిపై రైతు భరోసా కూడా పొందామన్నారు. పీఎం కిసాన్ రాకపోవడంతో ఇటీవల సచివాలయానికి వెళ్లి అడగ్గా, పాసు పుస్తకాలు, పట్టాలపై తహసీల్దార్ డిజిటల్ సంతకం లేనందున మంజూరుకాదని తేల్చి చెప్పడంతో ప్రస్తుత తహసీల్దార్ శ్రీనివాసరావును కలిసినట్లు చెప్పారు. అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా మంజూరుచేసిన పట్టాలుగా చెప్పినట్లు వాపోయారు.ఇచ్చిన పాసు పుస్తకాలు బోగస్‌వని తేలిందని వాపోయారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వోను కోరారు.

ఆలయానికి స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్య వైశ్య సంఘ నాయకులు

లక్కవరపుకోట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి స్థలం కేటాయించాలని ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు కోరారు.ఈ మేరకు మంగళవారం ఎల్.కోటలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.కోట టీడీపీ మండలాధ్యక్షుడు జీఎస్.నాయుడు, ఆర్యవైశ్య సంఘ నేతలు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాపై నిగ్గు తేల్చాలి: గద్దే

చీపురుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెద్దఎత్తున జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమరవాణాపై నిగ్గుతేల్చాలని పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యుడు గద్దే బాబూరావు కోరారు. మంగళవారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పోర్టును సందర్శించిన సమయంలో పలువిషయాలు వెలుగుచూశాయని తెలిపారు. 48 వేల కోట్ల బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నట్టు గుర్తించారని చెప్పారు. కాకినాడు పోర్టు అక్రమాలకు అడ్డాగామారిందని ఆరోపించారు.రేషన్ బియ్యం అక్రమ రవాణాకు ఎండీయూ వాహనాలను వినియోగిస్తున్నారని చెప్పారు.

పెనుబాకలో డయేరియా

● రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న బాధితులు



సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులు

రాజాం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబాకలో డయేరియా ప్రబలడంతో నలుగురు ఆసుపత్రి పాలయ్యారు. మూడురోజులుగా వ్యాధితో బాధపడుతున్న వీరంతా వైద్యసిబ్బంది కనీసం పట్టించుకోకపోవడంతో రాజాం సామాజిక ఆసుపత్రిని ఆశ్రయించారు.గ్రామానికి చెందిన బొమ్మాళి లక్ష్మి, తల్లీకొడుకులు కలమట నాగమణి, మహేష్ తోపాటు బి.మహేష్ డయేరియాతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యసిబ్బంది పట్టించుకోకపోవడంతో ఆసుపత్రిలో చేరాల్సివచ్చిందని వారు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, వాటర్ ట్యాంకు పరిశుభ్రం చేయకపోవడంతో కలుషిత నీరు సరఫరా అవుతోందని వాపోతున్నారు. తాగునీటిలో వ్యర్థాలు సైతం వస్తున్నాయని చెబుతున్నారు.గ్రామంలో మరికొంత మంది కూడా డయేరియాతో బాధపడుతున్నారని వారు తెలిపారు. కాగా ప్రస్తుతం రోగుల పరిస్థితి మెరుగ్గా ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు మంగళవారం రాత్రి తెలిపారు.

నిధులు మంజూరు కాక నిలిచిన ఆస్పత్రి పనులు

● రాజాం సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిబాబు

రాజాం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సకాలంలో నిధులు మంజూరు కాక, కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతోనే ఆసుపత్రిలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని రాజాం సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు స్పష్టంచేశారు. ఆసుపత్రి అభివృద్ధి పనుల్లో చోటుచేసుకుంటున్న జాప్యం, ఫలితంగా రోగులు, వైద్యులు, సిబ్బంది పడుతున్న అవస్థలపై నత్తా నవ్వుతోంది శీర్షికన ఈనెల మూడో తేదీన ఆంధ్రజ్యోతిలోకథనంపై ప్రచురితంకావడంతోవైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆరాతీశారు. ఈమేరకు మంగళవారం డీసీహెచ్ఎస్ కార్యాలయం నుంచి సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబును ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌కు సమాచారం అందించామని, పనులు నిలిచిపోయిన విషయాన్ని ఇప్పటికే ఏపీ మెడికల్ హెల్త్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు వివరించామని హరిబాబు స్పష్టం చేశారు.

యువకుడి ఆత్మహత్య



చంద్రశేఖర్ (ఫైల్)

బొబ్బిలి/బాడంగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటనపై రైల్వే ఎస్‌ఐ బాలాజీ కథనం మేరకు.. బాడంగి మండలం భీమవరానికి చెందిన కొండేటి చంద్రశేఖర్(23) డిగ్రీ చదువుకున్నాడు. పోటీ పరీక్షల కోసం పట్టణంలోని ఓ కోచింగ్ సెంటరులో శిక్షణ పొందుతున్నాడు. ప్రతిరోజూ స్వగ్రామం నుంచి బొబ్బిలి కోచింగ్ సెంటరుకు రాక పోకలు సాగిస్తున్నాడు. చంద్రశేఖర్‌కు తండ్రి లేడు. తల్లితోపాటు అన్నయ్య సత్యనారాయణ గుంటూరు పత్తిమిల్లులో కార్మికులుగా పనిచేస్తున్నారు. చంద్ర శేఖర్ భీమవరంలోని తమ నాన్నమ్మ, తాతయ్యల దగ్గర ఉంటూ పోటీ పరీక్షల కు ప్రిపేర్ అవుతున్నాడు. సోమవారం రాత్రి పదిగంటల సమయంలో బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో కనిపించడంతో పోలీసులు ఆరాతీసి, అక్కడ నుంచి పంపించి వేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఆర్టీసీకాంప్లెక్స్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా, స్థానిక పోలీసులు ప్రశ్నించారు.వివరాలు సేకరించిన తర్వాత పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. చంద్రశేఖర్ తనఇంటికి వెళ్లకుండా మంగళవారం తెల్లవారుజామున బొబ్బిలిలోని నాయుడు కాలనీకి సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వేపోలీసులు మృతదేహాన్ని బొబ్బిలి సీహెచ్‌సీలో ఉంచారు. గుంటూరులో ఉంటున్న అతని తల్లి, అన్నయ్యలకు సమాచారం అందించారు. అయితే మృతుడికి ఆన్‌లైన్ బెట్టింగ్ అలవాటు ఉన్నట్టు తన ఫోన్‌లోని సమాచారం బట్టి తెలుస్తోందని ఎస్‌ఐ తెలిపారు. మృతుని బంధువులు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

13 మద్యం సీసాలు స్వాధీనం

విజయనగరం క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బొండపల్లి మండలంలోని బిల్లలవలసలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ ఎస్వీ రామారావు ఆధ్వర్యంలో మంగళవారందాడులు నిర్వహించి 13 మద్యం స్వాధీనం చేసుకున్నారు.గ్రామంలో అక్రమంగా మద్యంవిక్రయిస్తున్న లింగంసూర్యనారాయణను అదుపులోకి తీసుకుని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిపై కేసు నమోదు చేసి గజపతినగరం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించామని ఎస్‌ఐ రామారావు తెలిపారు. దాడుల్లో హెచ్‌సీలు జి.సుదర్శన్ కుమార్, కె.రాంబాబు, కానిస్టేబుళ్లు బి.రాము, జి.మనోజ్ పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

లక్కవరపుకోట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):మండలంలో సారా విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎల్.కోట ఎస్‌ఐ నవీన్ పడాల్ హెచ్చరించారు. మంగళవారంరాత్రి కల్లేపల్లి, రేగ గ్రామాల్లో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. రెండు గ్రామాల ప్రజలతో మాట్లాడారు.

పెదబూరాడపేటలో 80 గొర్రెలు మృతి

నెల్లిమర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబూరాడపేటలో ఇద్దరు యాదవులకు చెందిన 80 గొర్రెలు ఆకస్మికంగా మృతి చెందాయి. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన డొప్ప త్రినాథ్‌కు చెందిన 60, కర్రి సూర్యనారాయణకు చెందిన 20 గొర్రెలు మృతి చెందాయి. వారం నుంచి ఈ గొర్రెలు వరి చేనులోని రాలిన కంకులను తింటున్నాయి. మూడు రోజుల నుంచి అస్వస్థతకు గురైన గొర్రెలకు నీళ్లు పట్టించి సపర్యలు చేశారు. మంగళవారానికి 80 గొర్రెలు మరణించినట్లు లెక్క తేలింది. ఈ విషయం పశువైద్య శాఖ అధికారులకు తెలియడంతో మండల పశువైద్యాధికారి వి.చంద్రశేఖర్‌తోపాటు జేడీ వైవీ రమణ, ఏడీ చక్రవర్తి తదితరులు గ్రామానికి చేరుకుని మిగిలిన గొర్రెలకు వైద్య సేవలందించారు. మృతి చెందిన గొర్రెలకు శవ పంచనామా కూడా చేశారు. వాటి పొట్టల్లో కిలోల బరువు గల అరగని ధాన్యం గింజలు ఉన్నాయని, ఇవి జీర్ణం కాకపోవడంతోనే మృతి చెంది ఉంటాయని పశు వైద్యులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. బాధితులను ఆదుకోవాలని సర్పంచ్ మక్కువ తవుడమ్మ, టీడీపీ నాయకుడు మక్కువ రాజారావు కోరుతున్నారు. కాగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి బాధితులను పరామర్శించారు. బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు.

నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు: ఎస్పీ

విజయనగరం క్రైం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఎస్పీ వకుల్‌జిందల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో గంజాయి, మద్యం, సారా, పశువుల అక్రమ రవాణా నియంత్రించడానికి వాహన తనిఖీలు నిరంతర ప్రక్రియగా చేపడుతున్నామని, రోజూ పది ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. రహదారి బధ్రత, చట్టాలు, సైబర్ మోసాలు, మహిళల భద్రతపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహన తనిఖీల్లో ఇర్రెగ్యులర్ నంబరు ప్లేట్లు కలిగిన వారిపై 280 కేసులు, హెల్మెట్ ధరించని వారిపై 7020, సిగ్నల్స్ అతిక్రమించిన వారిపై 570, ప్రమాదకర వాహనాలు నడిపిన వారిపై 209 కేసులు పది నెలల్లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి: ఏఎంవో

గజపతినగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):పదో తరగతిలో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా అకడమిక్ మోనటరింగ్ టీమ్ ఏఎంవో బి.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం మండలంలోని మరుపల్లిలోని ఆదర్శ, కేజీబీవీ పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం పదోతరగతి విద్యార్థుల సామర్థ్యాని పరిశీలించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, ఎంఈవోలు విమలమ్మ, చక్రధరరావు పాల్గొన్నారు.

బాలల సైన్స్ సదస్సులో రాజాం విద్యార్థులు

రాజాం,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):రాజాం బాలభవన్ విద్యార్థులు ఔరంగాబాద్‌లో ఇటీవల జరిగిన బాలల సైన్స్ సదస్సులో పాల్గొన్నారు. నేషనల్ బాలభవన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన బాలల సైన్స్ సదస్సులో దేశవ్యాప్తంగా 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో రాజాం బాలభవన్ విద్యార్థులు సీహెచ్ జాస్సర్, ఎస్.సాయినిరంజన్, ఎం.దినేష్‌కు అవకాశం లభించింది. వీరు రాష్ట్రం తరఫున పాల్గొన్నట్టు బాలభవన్ పర్యవేక్షకుడు సుంకరి రమేష్ తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి



నెల్లిమర్ల: ఏఈ పిచ్చయ్యకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాల నాయకులు

నెల్లిమర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్‌చేశారు. మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ వద్ద నిరసనతెలిపారు. అనంతరం ఏఈ పిచ్చయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ, న్యూడెమొక్రసీ నాయకులు రామారావు, పాపారావు, అప్పలసూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈఆర్‌సీ పేరుతో విద్యుత్ భారం మోపడం సరికాదని తెలిపారు.

● శృంగవరపుకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శృంగవరపు కోట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై 17,989 కోట్లు భారం కూటమి ప్రభుత్వం మోపడం భావ్యంకాదన్నారు. కార్యక్రమంలో చెలికాని ముత్యాలు, కె.రమేష్, వెంకటరావు, పైడిరాజు పాల్గొన్నారు.

● లక్కవరపుకోట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం తగదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం లక్కవరపుకోటలోని సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఏఈకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని చంద్రబాబు మాటిచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తరిని వెంకటరమణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులపై వివక్ష తగదు

● దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు

దివ్యాంగుల పట్ల వివక్ష తగదని, వారిపట్ల ఆదరాభిమానాలు చూపాలని అధికారులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాలోని భవిత కార్యాలయాల్లో జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని ఆటల పోటీలతోపాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బహుమతులు ప్రదానంచేశారు. అనంతరం భవిత కేంద్రాల సిబ్బంది, దివ్యాంగుల తల్లిదండ్రులు ర్యాలీలు నిర్వహించారు. -ఆంధ్రజ్యోతి బృందం



శృంగవరపుకోట: ర్యాలీ నిర్వహిస్తున్న భవిత కేంద్రం సిబ్బంది, దివ్యాంగులు

'వాష్' పై అవగాహన కల్పించాలి: పీడీ



మాట్లాడుతున్న పీడీ కల్యాణ చక్రవర్తి

విజయనగరం,డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వాష్ కార్యక్రమం ఆవశ్యకతను వివరించి, అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పథక సంచాలకులు (పీడీ) ఎ.కల్యాణ చక్రవర్తి ఆదేశించారు. మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్లు, ఏపీఎం, సీసీలకు వాష్ కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు.ఈసందర్భంగా కల్యాణ చక్రవర్తి ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంనిర్వహణ, సురక్షిత తాగునీరు,ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, ఘన వ్యర్థాల నిర్వహణలో పంచాయతీలు, స్వయం సహాయక సంఘాల అనుసంధానం తదితర అంశాలపై వివరించారు.కార్యక్రమంలో ఏపీడీ కె.సావిత్రి, హెచ్‌డీ యాంకర్ పర్సన్ కె.గీత, సీడీపీవో ప్రసన్న, జేజేఎం జిల్లా సమన్వయకర్త అజయ్, ఏపీఎంఏఎస్ సహాయక సిబ్బంది సత్య, ఆర్‌బీఎస్ మృదుల, కన్సల్టెంట్ దుర్గ పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో పాలకుల నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగం సంక్షోభానికి గురవుతోందని రైతు కూలి సంఘం ప్రతినిధి కందాపు పాల్గునరావు ఆరోపించారు. మంగళవారం విజయనగరంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెహరా శంకరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల సావనీరు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ,ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రెడ్డి నారాయణరావు, నవయువ సమాఖ్య ప్రతినిధి అప్పలరాజు పాల్గొన్నారు.

ఎంవీజీఆర్‌లో టెక్నాలజీపై ఎఫ్‌డీపీ ప్రారంభం

డెంకాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని చింతలవలస ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ (ఏ)మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఏఐసీటీఈ, ఏఎల్ అకాడమీ సహకారంతో ఇన్నోవేటివ్ గ్రీన్ జెనరేషన్, స్టోరేజ్ టెక్నాలజీస్‌పై ఆరురోజులపాటు ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) మంగళవారం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా స్థిరమైనశక్తి సాంకేతికతలు, వినూత్న నిల్వ పరిష్కారాలపై అధ్యాపకులు, పరిశోధకులు, పీజీ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులకు అవగాహన కల్పించనున్నారు. ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం.శివసుబ్రహ్మణ్యం ఎఫ్‌డీపీ లక్ష్యాలు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.రవికుమార్ హరితశక్తి సాంకేతికతల భవిష్యత్ ప్రభావాన్ని వివరించారు.మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం డీన్, స్పాన్సర్డ్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ, ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ అనిల్‌కుమార్ సౌరశక్తి, హైడ్రోజన్ నిల్వ బ్యాటరీ టెక్నాలజీ, ఫ్యూయల్ సెల్ టెక్నాలజీలో అభివృద్ధిపై వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రమేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం కాలేజ్ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఉందన్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కోఆర్డినేటర్ కె.రవికుమార్, 200 మందికిపైగా అధ్యాపకులు, పరిశోధకులు, పీజీ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లుచేయాలని, వారు చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని జీవించేందుకు తగిన అవకాశాలు కల్పించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. విజయనగరంలోని యూత్ హాస్టల్‌లో స్పందన దివ్యాంగుల సేవా సంఘం అధ్యక్షుడు సురేష్ అధ్యక్షతన మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్,దివ్యాంగుల కార్పొరేషన్ డైరెక్టర్ అనురాధ బేగం, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌ఫణి, బాలభార్గవి, చిక్కాల చిన్నమ్మలు, తాడేపల్లి నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, ఖలీల్‌బాబు, దిలీప్ పాల్గొన్నారు.

బానాదిలో గౌరీ పరమేశ్వరుల నిమజ్జనోత్సవం

వేపాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బానాదిలో సోమవారం రాత్రి నిర్వహించిన గౌరీ పరమేశ్వరుల నిమజ్జనోత్సవం నిర్వహించారు. మాజీ సర్పంచ్ గొంప వెంకటరావు, తులసి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి ఊరేగించారు. ఈ సందర్భంగా నేల డ్యాన్స్‌లు, డప్పు వాయిద్యాలు, బ్యాండుమేళాలు, మహిళలు కోళాటాలు ప్రదర్శించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బొండపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రబీలో అపరాల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధికదిగుబడి సాధించవ్చని ఏవో పీవీ మల్లిఖార్జునరావు తెలిపారు.మంగళవారం మండలంలోని కిండాం అగ్రహారం, రాచకిండాం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వరి కోతలు తర్వాత అపరాలు సాగుచేసే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సహాయకులు అప్పలనాయుడు, నిర్మల పాల్గొన్నారు.

మహాజన సభ నిర్వహించండి

జామి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):భీమసింగి సుగర్స్ మహాజన సభ నిర్వహించాలని లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు సుగర్స్ ఎండీ సన్యాసినాయుడుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కర్మాగారం మూతవల్ల వందలమంది కార్మికులకు అన్యాయం జరిగిందని, పరికరాలు తుప్పుపట్టియని తెలిపారు.

రేపు దివ్యాంగులకు ఆటల పోటీలు

పార్వతీపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):పార్వతీపురం జూనియర్ కళాశాల మైదానంలో గురువారం దివ్యాంగులకు జిల్లా స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతులకు కేటగిరీల వారీగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆట పోటీలు నిర్వహించారని చెప్పారు.

సాగునీటికి దారేదీ?

- చిట్టడవులను తలపించేలా పంట కాలువలు
- మరమ్మతులు, నిర్వహణకు నిధుల లేమి
- ఇబ్బందులు పడుతున్న రైతులు

బొబ్బిలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆయకట్టు భూములకు సాగునీరు అందించాల్సిన పంట కాలువలు చిట్టడవులను తలపిస్తున్నాయి. నిధుల లేమి కారణంగా వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో పంట కాలువల నిండా చెట్లు, తుప్పలు, డొంకలు పెరిగిపోతున్నాయి. వెంగళరాయసాగర్ జలాశయం నుంచి వచ్చే ప్రధాన కాలువలతో పాటు వాటికి అనుసంధానంగా ఉండే పిల్లకాలువల దుస్థితి చాలా దారుణంగా తయారయ్యింది. గొల్లపల్లి, అలజంగి, కారాడ, పిరిడి, పక్కి, కోమటిపల్లి, తదితర గ్రామాలకు వెళ్లే కాలువలతో పాటు పారాది, పెంట వేగావతి నది చానల్ నుంచి వచ్చే కాలువల దుస్థితి మరీ దయనీయంగా ఉంది. ఈ కాలువల్లో ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో రంగరాయపురం, పెంట, జె.రంగరాయపురం, చెల్లారపువలస తదితర గ్రామాలకు చెందిన సుమారు రెండువేల ఎకరాల ఆయకట్టు భూముల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సోముల చెరువు నుంచి రంగరాయపురం రామజోగి చెరువు వరకు గొలుసుకట్టు చెరువులకు సక్రమంగా నీరు అందకపోవడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆగస్టులో జరగాల్సిన ఉభాలకు ఆలస్యమయ్యింది. గెడ్డలో ప్రవహించే నీటితోనే రైతులు తమ సాగు అవసరాలను తీర్చుకోవల్సి వచ్చింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్కడక్కడా కొన్ని పనులు చేస్తున్నారు. పట్టణ ప్రాంతంలో ఈ పథకం అమలుకు అవకాశం లేకపోవడంతో మల్లమ్మపేట, గొల్లపల్లి, పాతబొబ్బిలి, అప్పయ్యపేట తదితర పట్టణ పరిధిలోని గ్రామాల్లో సాగునీటి వనరుల నిర్వహణ చాలా అధ్వాన్నంగా ఉంటోంది.

గత ప్రభుత్వ హయాంలో పనులు శూన్యం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు-మీరు పథకంలో చేపట్టిన పనులు తప్ప, వైసీపీ ప్రభుత్వం ఉన్న ఐదేళ్లలో సాగునీటి వనరులకు ఎటువంటి మరమ్మతులు, నిర్వహణ చేపట్టలేదు. నిధులు ఇవ్వడం లేదు. ఆయకట్టుదారులే శ్రమదానంతో పనులు చేసుకోవాల్సి వస్తోంది. పంట కాలువలన్నీ తుప్పలు, డొంకలతో పూర్తిగా మూసుకుపోయాయి. ప్రస్తుత ఎమ్మెల్యే బేబీనాయన తన సొంత సొమ్ముతో నియోజకవర్గ వ్యాప్తంగా అనేక చోట్ల పంట కాలువలు, నీటి వనరులను బాగు చేయించారు.

- చొక్కాపు నారాయణరావు, రంగరాయపురం



ఇదీ గొల్లపల్లి భూములకు వెళ్లే పంట కాలువ దుస్థితి

నిధులు వచ్చాయి.. టెండర్లు పిలుస్తాం

పిల్ల కాలువల మరమ్మతులకు ఉపాధి హామీ పథకంలో పనులు చేపడుతున్నాం. పెద్ద కాలువల పనుల కోసం జైకా నిధులు మంజూరయ్యాయి. దిబ్బగుడ్డివలస గ్రామంలో తప్ప మిగిలిన గ్రామాల్లో ఉపాధి నిధులతో పనులు ప్రతిపాదిస్తున్నాం. రైతుల అవసరాలను గుర్తించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. బొబ్బిలి పరిధిలో సుమారు రూ.50లక్షలు మంజూరయ్యాయి. వాటితో టెండర్లు పిలిచి, అన్ని రకాల పనులు పూర్తి చేస్తాం. చాలావరకు ఎమ్మెల్యే బేబీనాయన సొంత నిధులతో పనులు చేయించిన మాట వాస్తవమే.

- శంబంగి సుధీర్, ఇరిగేషన్ ఏఈ

సికెల్‌సెల్ ఎనీమియా రోగులకు రక్త పరీక్షలు

సీతంపేట రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వైటీసీ కేంద్రంలో సికెల్‌సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్న రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సికెల్ సెల్ ఎనీమియా పరీక్షా కేంద్రాన్ని వైటీసీలో ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రానికి అధిక సంఖ్యలో ఈ వ్యాధిగ్రస్తులు హాజరయ్యారు. ఐటీడీఏ పరిధిలోని 20 సబ్‌ప్లాన్ మండలాల్లో ఇటీవల నిర్వహించిన సికెల్‌సెల్ ఎనీమియా పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారికి హెచ్‌పీఎల్‌సీ టెస్టులను విశాఖపట్నం కేజీహెచ్ ఆసుపత్రి వైద్య బృందం పరీక్షించారు. ఈ రక్త పరీక్షల కేంద్రాన్ని పీవో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పీవో మాట్లాడుతూ ఈ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారికి విశాఖపట్నం కేజీహెచ్ వైద్య బృందం పాజిటివ్ సర్టిఫికెట్ మంజూరు చేస్తారని అన్నారు. ఈ సర్టిఫికేట్ ఆధారంగానే ప్రభుత్వం నుంచి రూ.10వేలు పింఛన్ పొందుతారని పీవో తెలిపారు. ఈ పరీక్షలకు 220 మంది వరకు రోగులు హాజరయ్యారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈవో పి.నారాయుడు, ఏటీడబ్ల్యూవో మంగవేణి ఉన్నారు.

చిల్లర వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూస్తా

- పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరిస్తున్న వర్తకులు

పార్వతీపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిల్లర వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తానని ఎమ్మెల్యే విజయచంద్ర హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలో రోడ్లపై చిల్లర వ్యాపారం చేసే వారంతా మంగళవారం ఎమ్మెల్యేను కలిశారు. రోడ్డుపై వ్యాపారాలు వద్దని పోలీసులు చెబుతున్నారని వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఎవరికి ఇబ్బంది లేకుండా అందరికీ సరైన స్థలంలో వ్యాపారులు జరిగేలా ఏర్పాటు చేస్తున్నామని, ఎవరూ భయపడవద్దని హామీనిచ్చారు. స్థలం చూసే వరకు వ్యాపారాలు చేసుకునేలా పోలీసులతో మాట్లాడుతానని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సహకరించాలని ఆయన వారిని కోరారు.

నీటి సంఘాల ఎన్నికలు సజావుగా జరగాలి

- పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలు సజావుగా జరగాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం నీటి సంఘాల ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సక్రమంగా జరిగేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

బెలగాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలో ఈనెల 8న జరిగే ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పార్వతీపురం బార్ అసోసియేషన్ సెక్రటరీ పీవీ కృష్ణారావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో పోస్టర్ ఆవిష్కరించారు. కోర్టులలో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులకు సౌకర్యాలు కల్పించాలని, న్యాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, న్యాయవాదలపై జరిగే దాడులను ఆపాలని ఐలాజ్ డిమాండ్ చేస్తుందని తెలిపారు. అన్నవరంలో జరిగే ఐలాజ్ రాష్ట్ర మహాసభకు న్యాయవాదులు హాజరయ్యి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జోగారావు, ప్రభాకరరావు, శశిభూషణ రావు, బాపూజీ, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఘంటసాల జయంత్యుత్సవాలు

పాలకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు 102వ జయంతోత్సవాలు ఈనెల 4న నిర్వహించనున్నట్టు శ్రీకోటదుర్గ కళాకారుల సేవా సమితి ప్రతినిధి కొబగాన సూరన్నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు కోటదుర్గమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఘంటసాల సంగీత విభావరి నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం కోటదుర్గమ్మ దేవస్థానం ఎండోమెంట్ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

మెరుగైన వైద్యం అందించాలి

- విప్ జగదీశ్వరి ● పీహెచ్‌సీ తనిఖీ

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రేగిడి గ్రామంలో ఉన్న పీహెచ్‌సీని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో ఉన్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు నిత్యం ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యాన్ని అందించాలని, వైరల్ ఫీవర్‌లు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు, ఆసుపత్రి సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం

రేగిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ ఉన్నత పాఠశాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎన్‌టీ నాయుడు, ఎంఈవో చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో సురేష్, హెచ్‌ఎం స్వాతి, మండల కన్వీనర్, పాడి సుదర్శనరావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు పాల్గొన్నారు.



పాఠశాల భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

సాలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ కోరారు. మంగళవారం సాలూరు పట్టణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో కిశోరి వికాసం ప్రాజెక్టు స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల వచ్చే అనార్థాలను ప్రతిఒక్కరికీ వివరించాలని సూచించారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో విజయలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శులు, నీడ్ డైరెక్టర్ వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలపై శ్రద్ధ వహించండి

పాచిపెంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పీడీ ఎం.నాగమణి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల పరిధిలో గల ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు కమిటీగా ఏర్పడి 11 నుంచి 18 సంవత్సరాలు వయస్సు కలిగిన కిశోర బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. సీడీపీవో బొత్స అనంతలక్ష్మి, నీడ్ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు, ఎంపీటీసీ సభ్యులు దండి ఏడుకొండలరావు, ఎంఈవో పి.జోగారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కొత్త ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి

జియ్యమ్మవలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా ఇళ్లు కావల్సిన వారు త్వరగా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని గృహ నిర్మాణశాఖ ఏఈ ఎల్.ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొత్తగా ఇళ్లు కావల్సిన వారు పీఎంఏవై 2.0 అర్బన్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. దీని కోసం ఆధార్, బ్యాంకు అకౌంట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు పొజిషన్ సర్టిఫికేట్‌తో ఆన్‌లైన్ చేయించుకోవాల న్నారు. అలాగే ప్రస్తుతం చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ● కురుపాం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలో గల కురుపాం, కిచ్చాడ పంచాయతీల్లో అర్హులైన పేదలు కొత్త ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీఎంఏవై 2.0 కింద కొత్త గృహాలకు సంబంధించి హౌసింగ్ ఏఈ అచ్చియ్యమ్మతో సమావేశం నిర్వహించారు. కొత్త ఇళ్ల కోసం కురుపాం హౌసింగ్ ఏఈ కార్యాలయానికి దరకాస్తులు అందజేయాల న్నారు.

ఆరోగ్య సమస్యలను గుర్తించాలి

పార్వతీపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయిలో ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రా వు సూచించారు. పెదబొండపల్లి పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశా డే సమావే శంలో ఆయన పాల్గొన్నారు. శిశు ఆరోగ్య విష యమై శ్రద్ధ చూపాలన్నారు. పిల్లల తల్లి దం డ్రులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిం చాలన్నారు. గర్భిణుల్లో హైరిస్క్ ఆరోగ్య సమ స్యలను గుర్తించి, సమస్యను బట్టి స్పెషలిస్టు తో ఆరోగ్య తనిఖీలు చేయించాలని సూచించారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వారిని క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్ర శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవా రం ఒక ప్రకటన విడుదల చేశారు. గుమ్మలక్ష్మీపు రం, కురుపాం మండలంలో ఉన్న అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య ఉప కేంద్రా ల్లో ఖాళీగా ఉన్న వాచ్‌మేన్, అటెండర్ ఉద్యోగు లు ఇప్పిస్తామంటూ గుమ్మ లక్ష్మీపురం, మెండెం ఖల్లు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గిరిజన నిరుద్యోగులను ఉద్యోగాలు ఇప్పిస్తా మని సుమారు 20 మంది దగ్గర డబ్బులు వసూలు చేసి, నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చి మోసం చేశారన్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేయాల ని డిమాండ్ చేశారు.

శ్యామలాంబ అక్కాచెల్లెమ్మలకు పసుపు, కుంకుమలు

సాలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్యామలాంబ అమ్మవారి అక్కా చెల్లెమ్మలైన దేశమ్మతల్లి, ముత్యాలమ్మతల్లి, కొత్తమ్మతల్లి, బంగారమ్మ అమ్మవార్లుకు అనువంశిక ధర్మకర్త విక్రమచంద్రసన్యాసిరాజు (యువరాజు) మంగళవారం ఉదయం 6:30 గంటలకు పసుపు, కుంకుమ సమర్పించారు. ఈసందర్భంగా ఆయనతో పాటు శ్యామలంబ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్యాన అప్పారావు, నిమ్మాది తిరుపతిరావు, కూనిశెట్టి భీమారావు మాట్లాడుతూ వచ్చే ఏడాది మే నెలలో 18, 19, 20 తేదీల్లో అమ్మవారి పండుగను జరిపించుటకు నిశ్చయించినట్టు చెప్పారు. అనంతరం పండుగ కరపత్రాన్ని విడుదల చేశారు.

వేద పాఠశాలను ఏర్పాటు చేయాలి

పాలకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేద పాఠశాలను ఏర్పాటు చేయాలని పాలకొండ పట్టణ బ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. నగర పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ పల్లా కొండలరావును నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం కలిసి, వినతిపత్రం అందించారు. పాఠశాల నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై కొండలరావు స్పందించారని బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీధర్ తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ, బంకుపల్లి చిట్టిబాబు, జె.కామేశ్వరరవు, బాలు, శ్రీనివాసశర్మ, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కుల వివక్ష కేసుపై దర్యాప్తు

భామిని, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దదిమిలి గ్రామంలో అట్రాసిటీ కేసు నమోదుపై పాలకొండ డీఎస్పీ రాంబాబు మంగళవారం దర్యాప్తు చేపట్టారు. పెద్దదిమిలిలో పాఠశాల సమీపంలో ఆట స్థలాన్ని బీసీ కులస్తులు చదును చేసుకోగా దళిత యువత ఆ స్థలం తమదంటూ అక్రమాలకు పాల్పడ్డారు. మాట మాట పెరగడంతో ఉభయులు బత్తిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పలువురు కుల వివక్ష కేసు పెట్టారు. దీనిపై బత్తిలి ఎస్ఐ అనీల్‌కుమార్ కేసు నమోదు చేసి, పాలకొండ డీఎస్పీకి సమాచారం అందించారు. ఈ మేరకు డీఎస్పీ గ్రామంలో ఉభయులను విచారించి, స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు.

సీఎంను కలిసిన వీరేశ్

కురుపాం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ మంగళవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కురుపాం నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా సీఎం సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

ముసుగు దొంగలపై అప్రమత్తం

జియ్యమ్మవలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముసుగు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీసీఎస్ ఎస్ఐ టి.తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన చినమేరంగిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొందరు మాస్కులు, హెల్మెట్లు, మంకీ క్యాప్‌లు వేసుకుని ఒంటరిగా వెళ్తున్న మహిళలనే లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. చినమేరంగి ఏఎస్ఐ పి.కాసుల పాల్గొన్నారు.

తుఫాన్‌తో రైతులకు నష్టం

వీరఘట్టం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా రైతులకు నష్టం వాటిల్లింది. నూర్చిన వరి ధాన్యాలు కుప్పలుగా వేయడంతో వాన నీటికి తడిచిపోయాయి. తేమశాతం ఎక్కువయితే నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. క్యాబేజీ పంటపై తుఫాన్ ప్రభావం పడి, రైతులు నష్టపోయారు.

డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- డీపీవో కొండలరావు

కొమరాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలలో డిజిటలేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు ఆదేశించారు. విక్రాం పురం గ్రామ సచివాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా విక్రాంపురంలో నిర్వహిస్తున్న పన్నులు, తదితర వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. డిజిటలైజేషన్ ప్రక్రియపై కార్యదర్శి పి.భీమయ్యకు పలు సూచనలు ఇచ్చారు. పంచాయతీ విస్తరణాధికారి ఎం.రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం తగదు

కురుపాం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ భారం తగదని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, సీపీఎం నాయకులు జి.సూరయ్య, కె.లింగరాజు, నాయకులు డిమాండ్ చేసారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో విలేకర్లతో మాట్లాడారు. వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పువ్వల ప్రసాద్, మండంగి సింగన్న పాల్గొన్నారు.

గురుకుల మీట్‌లో సత్తా చాటిన బొడ్డవలస విద్యార్థులు

సాలూరు రూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా జరిగిన బీఆర్ అంబేడ్కర్ గురుకులాల రాష్ట్ర స్థాయి మీట్‌లో జోన్-1 ఆల్‌రౌండ్ చాంపియన్‌గా బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకులం నిలిచినట్టు ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, పీడీ విద్యాసాగర్ చెప్పారు. వారు మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. చదరంగం పోటీల్లో పదో తరగతి విద్యార్థి వరుణ్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం కైవశం చేసుకున్నాడని తెలిపారు. షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీల్లో చరణ్‌తేజ, హర్ష ఒక రజతం, రెండు కాంస్య పతకాలను సాధించారన్నారు. ఈ మేరకు జోన్-1లో బొడ్డవలస గురుకులం ఆల్ రౌండ్ చాంపియన్ సాధించిందని చెప్పారు. విద్యార్థులను గురుకులాల ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్ అభినందించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము-దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ పోలమాంబ అమ్మవారి దేవస్థానములు, శంబర గ్రామం, మక్కువ మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.

ఆర్.సి.నెం.17/2024-25 తే.3.12.2024

టెండరు-కం-బహిరంగవేలం ప్రకటన

శ్రీ అమ్మవారి దేవస్థానములో జరుగు వార్షిక జాతర సందర్భముగా తే.15.01.2025ది నుండి తే.01.04.2025ది వరకు అనుభవించు హక్కు కొరకు ఇందుతో పేర్కొనిన వివిధ టెండరు-కం-బహిరంగ వేలములు తే.13.12.2024దీ శుక్రవారం ఉదయం గం.11.00ని.ల నుండి శ్రీ అమ్మవారి కార్యాలయం మండపం నందు నిర్వహించబడును.

క్రమ సంఖ్య	వివరములు	కాల పరిమితి	ప్రథమ ధరావత్తు మొత్తము రూ॥
1	చీరలు, రవికలు, రాగి మరియు ఇత్తడి ప్రోగు చేసుకొని తీసుకుపోయే హక్కునకు	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.50,000.00
2	కొబ్బరిముక్కలు ప్రోగు చేసుకుని తీసుకుపోయే హక్కునకు	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.50,000.00
3	తలనీలములు ప్రోగు చేసుకొని తీసుకుపోయే హక్కునకు	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.50,000.00
4	శ్రీ అమ్మవారి లామినేషన్ ఫోటోలు అమ్ముకొనుటకు	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.10,000.00
5	వనంగుడి వద్ద దీపాలు పెట్టుకుని అమ్ముకునే హక్కునకు	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.10,000.00
6	చదురుగుడికి, పరిసర ప్రాంతములలో విద్యుత్ అలంకరణ, జనరేటర్లు, ఎల్.ఇ.డి.లైట్స్,ఆర్చ్ గేటుల మరియు పెద్దపి, సౌండ్‌సిస్టమ్‌లు ఏర్పాటు చేయుట	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.5,000.00
7	వనంగుడికి, పరిసర ప్రాంతములలో విద్యుత్ అలంకరణ, జనరేటర్లు, ఎల్.ఇ.డి.లైట్స్,ఆర్చ్ గేటుల మరియు పెద్దపి, సౌండ్‌సిస్టమ్‌లు ఏర్పాటు చేయుట	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.5,000.00
8	చదురుగుడి వద్ద ప్రత్యేక దర్శనం, శ్రీఘ్రదర్శనం, ఉచిత దర్శనం క్యూ-లైన్‌లు నిర్మించుటకు, సాంస్కృతిక నాటకములకు, ఇతర కార్యకలాపాములకు జాకీస్టేజీలు, వాటర్‌ప్రూఫ్ టెంట్లు, పెండాల్స్ ఏర్పాటు చేయుట	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.5,000.00
9	వనంగుడి వద్ద ప్రత్యేక దర్శనం, శ్రీఘ్రదర్శనం, ఉచిత దర్శనం క్యూ-లైన్‌లు నిర్మించుటకు, సాంస్కృతిక నాటకములకు, ఇతర కార్యకలాపాములకు జాకీస్టేజీలు, వాటర్‌ప్రూఫ్ టెంట్లు, పెండాల్స్ ఏర్పాటు చేయుట	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.5,000.00
10	వంటపాత్రలు, షామియానాలు సప్లయి చేయుట,	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.3,000.00
11	లడ్డూ, పులిహోర, టీ, టిఫిన్, భోజనములు తయారుచేయుటకు లేబర్ చార్జీల కొరకు	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.3,000.00
12	సీసీ కెమెరాలు, తాత్కాలికముగా అమర్చుట	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.3,000.00
13	మూడు దేవాలయములకు, విగ్రహములకు, అమ్మవారి గద్దెలకు, సిరిమాను రథమునకు రంగులు వేయుటకు	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.3,000.00
14	పూలదండలు మరియు పూల అలంకరణ చేయుట	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.3,000.00
15	శానిటేషన్ మెటీరియల్ సప్లయి చేయుట	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.3,000.00
16	కూరగాయలు, పాలు, పెరుగు సప్లయ్ చేయుటకు	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.3,000.00
17	అమ్మవారి చీరలు, శేష వస్త్రములు, కండువాలు, శాలువాలు జాకెట్ పీస్‌లు సప్లయ్ చేయుటకు.	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.3,000.00
18	ఉత్సవముల జరుగు మూడు నెలల ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా అవసరమగు మ్యాన్‌పవర్ సిబ్బందిని సప్లయ్ చేయుటకు	తే.15.01.2025దీ నుండి తే.01.04.2025 వరకు	రూ.3,000.00

ముఖ్య షరతులు: 1. పై లైసెన్సు హక్కులకు పేపరు టెండరు దాఖలు చేయువారు తే.04.12.2024దీ నుండి తే.13.12.2024ది వరకు దేవస్థాన కార్యాలయం వద్ద వ.నెం.1 నుండి 5వరకు రూ.1,000/-, వ.నెం.6 నుండి 18 వరకు రూ.500/-చెల్లించి టెండరు షెడ్యూలు పొందవచ్చును. టెండర్ కం బహిరంగ వేలంలో పాల్గొనేవారు The Executive Officer, Sri Polamamba Ammavari Devasthanam, Sambara వారి పేరున ధరావత్తు సొమ్ముకు డి.డి.తీసుకొని దేవస్థానము వారు ఏర్పాటు చేసిన టెండర్‌బాక్సు నందు తే.13.12.2024దిన బహిరంగవేలము పాటకు ముందు ఉదయం గం.10.00ల లోపు వేయవలెను. 2.టెండరు కం బహిరంగవేలము పాటకు ముందు ఉదయం గం.10.00లలోపు వేయవలెను. ఐ.డి.మరియు అడ్రసు ప్రూఫ్‌గా రేషన్‌కార్డు మరియు ఆధార్‌కార్డు జెరాక్సును పాట ప్రారంభమునకు ముందుగా అధికారులకు చూపించి జెరాక్సులను అధికారులకు ఇవ్వవలెను. అట్లు లేని యెడల వారి వద్ద నుండి ధరావత్తు స్వీకరించబడదు. 3. పాటదారులు పాట ముగిసిన వెంటనే పాట మొత్తం సొమ్మును వెంటనే చెల్లించవలెను. 4.టెండరు కం బహిరంగవేలం నందు పాల్గొను పాటదారుడు హిందువులై ఉండవలెను. 5.పాటకాలమందు అవసరమైన కొన్ని షరతులు విధించుటకు, తగు మార్పులు చేయుటకు, ఏ కారణము చేతనైనను పాటలు అపు చేయుటకు గాని, పొడిగించుటకు గాని, దేవస్థానము కార్యనిర్వహణాధికారి వారికి అధికారము కలదు. కావున షరతులు నిశితముగా గమనించి టెండరు కమ్ బహిరంగవేలంలో పాల్గొనవలెను.

స్థలం:శంబర గుమాస్తా సం/- బి.వి.సూర్యనారాయణ
తేది:04.12.2024 సెల్ నెం:9989174262 కార్యనిర్వహణాధికారి

గమనిక: 1. సాలూరు పట్టణం నుండి శంబర గ్రామమునకు 18కి.మీ.ఉండును, బస్సు సౌకర్యం కలదు. 2. పార్వతీపురం నుండి చినబోగిల, మక్కువ మీదుగా శంబరకు బస్సు సౌకర్యం కలదు. 3. బొబ్బిలి నుండి మక్కువ మీదుగా శంబరకు బస్సు సౌకర్యం కలదు.